క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



భవనంవారిపాలెం(కర్లపాలెం): మైనర్లకు ద్విచక్ర మోటారు వాహనాలు, కార్లు ఇవ్వవద్దని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని భవనం వారిపాలెంలో శుక్రవారం రాత్రి ఎస్ఐ స్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని చెప్పారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని బైకులపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. గ్రామంలోని వారందరూ తమకున్న వివాదాలను పక్కనపెట్టి కలసి మెలసి జీవించాలని రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ, గ్రామస్తులు శంకర్‌రెడ్డి, ధనగోవిందరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రామకోటిరెడ్డి, మాధవరెడ్డి, చక్రధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

లోక్‌అదాలత్‌లో ఉచిత న్యాయ సేవలు



రేపల్లె రూరల్: మండల లీగల్ సర్వీసు ద్వారా నిర్వహించే లోక్‌అదాలత్‌లో ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి టీ.వెంకటేశ్వర్లు చెప్పారు. మండల లీగల్ సర్వీసు కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సబ్‌జైలులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. రుసుము చెల్లించి న్యాయవాదులను ఏర్పరుచుకోలేని రిమాండ్ ఖైదీలు మండల లీగల్ సర్వీసును ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. కక్షలు, రాగద్వేషాలను వీడి శాంతియుతంగా జీవించాలన్నారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, న్యాయవాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



సూరేపల్లి(భట్టిప్రోలు): రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం విద్యార్థుల సలహాలు, సూచనలు, స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన శనగపల్లి నవ్య (10వ తరగతి) జిల్లాస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచింది. శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన నవ్యను హెచ్ఎం కె.శ్రీనివాసశర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

భగత్‌సింగ్, గుర్రం జాషువాలకు నివాళి

భట్టిప్రోలు: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు హక్కుల కోసం పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ కోరారు. శనివారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం భగత్‌సింగ్, గుర్రం జాషువాల జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ పరాయి పాలన నుంచి విముక్తి కోసం అతి పిన్న వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ పోరాట యోధుడు భగత్‌సింగ్ అని పేర్కొన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం ఆవశ్యకతను కోర్టులో వాదించి దేశ ప్రజలలో చైతన్యం నింపిన గొప్ప విప్లవకారుడని తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా రచనలు పలువురికి ఆదర్శ ప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ అమ్రేష్, ఉపాధ్యాయులు ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ ఫౌండేషన్ షాలేమ్ రాజుకు గౌరవ డాక్టరేట్



భట్టిప్రోలు: తెలుగు రాష్ట్రాలలో గ్రేస్ ఫౌండేషన్ ద్వారా కులమత, వర్గ విబేధాలు లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్‌రాజు శనివారం గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో శనివారం జేఎస్ఆర్ చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ అండ్ ఎల్‌సీఈఎస్ ఫౌండేషన్ సంయుక్తంగా అబ్దుల్ కలాం నేషనల్ సేవా అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో నిష్ణాతులైన వారికి డాక్టరేట్, అవార్డులను అందజేశారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ జె.సురేష్ బాబు, ఎల్‌సీఈఎస్ ఫౌండేషన్ నిర్వాహకులు కె.బుచ్చేశ్వరరావు, నిర్వాహకులు శ్రీనివాసరావుల చేతుల మీదుగా షాలేమ్ రాజు అవార్డును అందుకున్నారు.

బాబుకు మంచి బుద్ధి ఇవ్వండి స్వామీ

- శ్రీవారిని దర్శించుకునేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని డిక్లరేషన్ అడగటం చంద్రబాబు అవివేకానికి నిదర్శనం
- రాజకీయంగా ఎదుర్కోలేకే అపనిందలు
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఈవూరు గణేశ్
- చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి శ్రీ ఆనందేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలంటూ ప్రత్యేక పూజలు



ఆనందేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ ఈవూరు గణేష్



బాపట్ల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పిట్టలవానిపాలెం బండ్లమ్మ తల్లి ఆలయంలో గాదె యువసేన పూజలు



అద్దేపల్లి శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వైఎస్సార్ సీపీ నేతల పూజలు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లడ్డూ ప్రసాదంపై చేసిన దుష్ప్రచారంతో ఏర్పడిన పాప ఫలితాన్ని నివారించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఈవూరు గణేష్ శనివారం చెరుకుపల్లి మండలంలోని గుళ్లపల్లిలో వేంచేసియున్న శ్రీ ఆనందేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేయటం బాధాకరమన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేకనే రాజకీయంగా శ్రీవారి ప్రసాదం కలుషితమైందంటూ అపనిందలు వేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి పర్యటన అడ్డుకునేందుకు డిక్లరేషన్ పేరుతో రాజకీయ కుట్రకు చంద్రబాబు తెరలేపారన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు డిక్లరేషన్ ఎందుకని ప్రశ్నించారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు ముఖ్యమంత్రి హోదాలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకోలేదా అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నాయకుడిగా జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా పాదయాత్ర పూర్తి చేసి శ్రీవారిని దర్శించుకున్నారన్నారు. అప్పుడు లేని డిక్లరేషన్ ఇప్పుడేంటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6 హామీలు అమలు చేయలేకే రాజకీయ కుట్రతో అపనిందలు వేస్తున్నారన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై సిట్ వల్ల నిజాలు బయటకు రావని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితోగాని, సీబీఐతోగాని విచారణ చేయించి నిజానిజాలను నిగ్గుతేల్చాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శ్రీవారు సద్బుద్ధిని ప్రసాదించాలని, రాష్ట్ర ప్రజలపై కరుణా కటాక్షాలు చూపించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి, బగ్గారెడ్డి, రవిరెడ్డి, సుబ్బారెడ్డి, అరుణ్, బాషా, సుభాని, నాగేశ్వరరావు, ఈవూరు పాపారావు, కాశీప్రభాకర్, యెనుమల వెంకటేశ్వరరావు, నాగాంజనేయులు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారంతో తిరుమలను అపవిత్రం చేసిన సీఎం చంద్రబాబు : ఎంపీపీ లలిత కుమారి

అద్దేపల్లి(భట్టిప్రోలు): తిరుమల లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీ జరిగిందంటూ అబద్ధపు ప్రచారం చేసి సీఎం చంద్రబాబునాయుడు తిరుమలను అపవిత్రం చేసారని దీనికి పరిహారంగా పాప ప్రక్షాళన కోసం శనివారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలోని శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతలను, భక్తుల మనోభావాలను కించపరచేలా సీఎం చంద్రబాబు నాయుడు వ్యవహరించడం బాధాకరమన్నారు. లడ్డూ పవిత్రతను రాజకీయ దుర్బుద్ధితో కావాలని అబద్ధాలాడి చంద్రబాబునాయుడు అపవిత్రం చేశారని పేర్కొన్నారు. శ్రీ వారి లడ్డూ విషయంలో అబద్ధపు ప్రచారంతో మహా అపచారం చేసిన చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామి వారిని వేడుకున్నారు. భక్తులకు ప్రసాదాలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్, పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు వేల్పూరి చిన్నారి, పడమట శ్రీనివాసరావు, తలకొల యలమంద, కొతరపు శ్రీనివాసరావు, పసుపులేటి శివరామ ప్రసాద్, కరింశెట్టి బాలు, డొక్కు ప్రకాష్, బడుగు గోపి, పప్పుల చిరంజీవి, పప్పుల విజయరాజు,కుక్కల వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నీచ రాజకీయాలు మానుకోవాలి ..

బాపట్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దేవుడిని అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలకు దిగటం సరికాదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి పేర్కొన్నారు. పార్టీ పిలుపు మేరకు బాపట్ల పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీవేంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇబ్బందులకు గురి చేయటమే ప్రధాన అజెండాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యూహం అనుసరిస్తుందని తెలిపారు. ఓదార్పు యాత్రకు ముందు, తరువాత కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవటంతోపాటు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్వామి వారికి పట్టువస్త్రాలను బహూకరించిన విషయం చంద్రబాబుకు కనిపించలేదని కోకి రాఘవరెడ్డి ప్రశ్నించారు. ఎంతో మంది మనోభావాలకు సంబంధించిన తిరుమల లడ్డూ వ్యవహారంలో కూడా ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల దర్శానికి వెళుతున్నారంటే ఒక రాద్ధంతం..వెళ్లలేదంటే మరో రాద్ధంతంగా డబుల్ స్టేట్‌మెంట్లు తయారు చేసుకుని కూటమి ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు.

డిక్లరేషన్ ఎందుకు చంద్రబాబు?

తిరుమల వెళ్లేందుకు డిక్లరేషన్ ఎప్పటి నుంచి పెట్టారో తెలియజేయాలని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు సనాతన ధర్మం అంటూ డిక్లరేషన్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. నెయ్యి వాడలేదని నారా చంద్రబాబునాయుడు తనయుడు లోకేశ్ సైతం చెప్పారని, చంద్రబాబునాయుడుకు మంచిబుద్ధి ప్రసాదించాలని శ్రీవేంకటేశ్వరస్వామిని వేడుకుంటున్నామని చెప్పారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు బుల్లిరెడ్డి, మోర్ల సముద్రాల గౌడ్, ఇనగలూరి మాల్యాద్రి, తన్నీరు అంకమ్మరావు, నన్నం వెంకటేశ్వర్లు, నక్కా వీరారెడ్డి, కుర్రా రాంబాబు, జోగి రాజా, సుమన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వలివేరులో వైఎస్సార్ సీపీ నేతల పూజలు..

వలి వేరు(వేమూరు): వేంకటేశ్వరస్వామి పవిత్రతను దెబ్బతీసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని జెడ్పీటీసీ దాట్ల సౌజన్య అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలోని రామమందిరంలో శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తప్పుడు వాగ్దానాల ద్వారా అధికారం చేపట్టారని, ఇప్పుడు వాటినుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుమల శ్రీవారి ప్రసాదంపై రాజకీయాలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాట్ల మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు, ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండ్లమ్మ తల్లి ఆలయంలో పూజలు..

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక సీఎం చంద్రబాబునాయుడు తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపణలు చేయటం సిగ్గు చేటని గాదె యువసేన బాపట్ల నియోజక వర్గం కన్వీనర్ దేగల రవిరెడ్డి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె మధుసూదన రెడ్డి ఆదేశాల మేరకు గాదె యువసేన ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం శ్రీ బండ్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాముఖ్యతను తగ్గించేలా లడ్డూ ప్రసాదం విశిష్టతపై చవకబారు ఆరోపణలు చేస్తూ ప్రతిష్టను మంటకలిపారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని పూజలు చేశామని చెప్పారు. పూజలలో దోమ తిరుమలరెడ్డి, అలవల అశోక్‌రెడ్డి, కుంచాల కిరణ్‌కుమార్‌రెడ్డి, దేగల దుర్గారెడ్డి, గాదె యువసేన, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చేనేత రంగ సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్



రేపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ, చేనేత సంఘం నాయకులు

రేపల్లె రూరల్: చేనేత రంగంలోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (సీఐటీయూ) బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 3వతేదీన భట్టిప్రోలులో నిర్వహించనున్న సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో రేపల్లెలో శనివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేనేతపై కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న జీఎస్టీని పూర్తిగా రద్దుచేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. చేనేత కార్మికుల సమస్యలను చర్చించే ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించటంతో పాటు నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించి షెడ్డు కార్మికులకు, సహకార సంఘాలలో నేస్తున్న నేత కార్మికులకు, అనుబంధ వృత్తులవారికి అమలు జరపాలన్నారు. ఇల్లు లేని చేనేత కార్మికులకు 3 సెంట్ల స్థలం కేటాయించి, మగ్గం షెడ్డుతో కూడిన పక్కా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. చేనేతకు రాష్ట్ర బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయించాలని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై నిర్వహించే సదస్సులో రాష్ట్ర, స్థానిక చేనేత నాయకులు పాల్గొంటారని, సదస్సులో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దీపాల సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకులు జీ.నాగరాజు, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా

ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్ర

రేపల్లె రూరల్: మానవ విలువలతో కూడిన రచనలు చేసి పలువురు సాహిత్యకారులకు ఆదర్శప్రాయుడిగా నిలిచిన జాషువా సేవలు ఎనలేనివని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్ర అన్నారు. కవికోకిల, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువ జయంతి సందర్భంగా పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంటరానితనం, దోపిడీలపై తన సాహిత్యం ద్వారా పోరాడి సమాజంలో మార్పు కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి జాషువా అన్నారు. గబ్బిలం, పిరదౌశి, కాందిశీకుడు, క్రీస్తు చరిత్ర, వంటి అనేక మహా కావ్యాలు ఆయన కలం నుంచి జాలువారాయన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎన్‌టీటీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు హైమావతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.కోటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు

కొల్లూరు: అసాంఘిక కార్యకలాపాలలో రౌడీషీటర్లు పాలుపంచుకున్నట్లు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు హెచ్చరించారు. శనివారం కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలోని రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రౌడీషీటర్లుగా కేసులు నమోదైన వ్యక్తులు ఎటువంటి వివాదాలు, గొడవలు, కొట్లాటలలో పాల్గొనరాదని అన్నారు. పోలీసుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే కఠినశిక్షలు అమలయ్యేలా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలోని రౌడీ షీటర్లు పోలీసులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా స్టేషన్‌కు వచ్చి వారి దినసరి కార్యకలాపాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సూరేపల్లిలో కమ్యూనిటీ పోలీసింగ్

సూరేపల్లి(భట్టిప్రోలు): ప్రజలకు భద్రతపై భరోసా కల్పిస్తూ శాంతి భద్రతల పరిరక్షణ, సమాజంలో జరిగే వ్యక్తిగత, ఆర్థిక భద్రత పరమైన నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్ఐ ఎం.శివయ్య పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లిలోని గ్రామస్తులతో శనివారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశానుసారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

కర్లపాలెం విద్యుత్ ఏఈగా బాషా

కర్లపాలెం: కర్లపాలెం మండల విద్యుత్ శాఖ ఏఈగా షేక్ బాషా శనివారం బాధ్యతలు చేపట్టారు. చెరుకుపల్లి మండల విద్యుత్ ఏఈగా పనిచేస్తూ బదిలీపై బాషా కర్లపాలెం వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించటంతో పాటు వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానన్నారు.

'మన ఇల్లు-మన గౌరవం' అవగాహన సదస్సు

వేమూరు: గత ప్రభుత్వంలో వివిధ దశలో ఉన్న గృహాలు తర్వగా పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి విలియమ్స్ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెల చివరకు వివిధ దశల్లో ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం బిల్లులు వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులందరు ముందుకు వచ్చి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. తహసీల్దార్ సుశీల, ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ, గృహ నిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు

జంపని(వేమూరు): క్రీడల్లో బాలికలు సైతం ముందంజలో ఉండటం శుభపరిణామమని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్14, అండర్17 బాల బాలికల కబడ్డీ నియోజకవర్గ జట్లను ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ వేల్పూల విజయబాబు, నియోజక వర్గం కన్వీనర్ గోపాల రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, శ్యాంబాబు, కె.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

చందోలు(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండల పరిధిలో పలు చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని చందోలు ఎస్ఐ ఆర్.స్వామిశ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఇటీవల కోమలి గ్రామంలో విద్యుత్ మోటారు, సంగుపాలెం కోడూరు గ్రామంలో కేబుల్ వైరు అపహరణకు గురయ్యాయి. వాటి యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి చోరీలకు పాల్పడిన బెజ్జం అశోక్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ ఎంపికలు



బాపట్ల: బాపట్ల నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ 14,17 బాలబాలికల పోటీలు శనివారం ముగిశాయి. పోటీలను మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ ప్రారంభించారు. ఈపోటీల్లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, యోగాలో ఎంపిక పోటీలు నిర్వహించారు. కమిషనర్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ గెలుపు ఓటమి లెక్కల కాకుండా క్రీడాల్లో ప్రావీణ్యత కలిగి ఉండాలని సూచించారు. ఎంఈఓ నిరంజన్, హెచ్ఎంలు రాజేశ్వరి, ప్రసాద్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.కె.కరిముల్లా, కో-ఆర్డినేటర్ కత్తి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.